2. విమోచకుని నామమందున - దజ్జనంబుల - విశ్రుతానందంబు ప్రాణముల = [1]అమందముగ హెచ్చరించు -నతని నీతి రీతిc దజ్జ - నముల కోర్కె వృద్ధి బొం - దంగc జేయు [2]సంతతంబు ॥వారు॥

3. నరులపై బిశాచమును - నిందా స్థాప - నంబు జేయంగలేదు = [3]పరగు - ప్రకాశమును = బ్రాపు నైన సర్వే - శ్వరుcడు బలము రక్షయు [4]న- వారితముగ మనకు నిచ్చు ॥వారు॥

4. వరగుణ ప్రశస్తులారా - క్రైస్తవులారా - వన్నె మీర మీ రాజు = [5]సురుచిరముగ శాశ్వతముగc - పరిపాలించు మీ దేవుcడు - నిరతముగను జీవించు - నీతి భరిత చిత్తుcడగుచు ॥వారు॥

- విలియం డాసన్

## 473 సుబోధ

రా -మోహన తా-ఆది

వద్దు మనస - బుద్ధి కురుచ = పెద్దలకుc బెద్ద పరి - శుద్ధుc డగు క్రీస్తు తా - దిద్దు నినుc బ్రేమ సరి - హద్దులను మీరcబో ॥వద్దు॥

1. చెడ్డ తలcపు - లడ్డి నిలుపు = మెడ్డెలకు నెడ్డెయగు - గడ్డు సాతాను నకు - మెడ్డుకొని దొడ్డ ప్రభు - బిడ్డవలె నడువు మిcక ॥వద్దు॥

2. నింద పాలు - బొంద మేలు = పొందుగను అందముగ - ముందు నీ యందు వెలుc - గొందు ప్రభు సుందర ని -బంధనలు మరిచ పో ॥వద్దు॥

3. ఆశ బెట్టు - యేసు తట్టు = దోసములు వాసి చనc - జేసి నను మోసి కొను- యేసు నిజ దాసులను - బాసి యుండకు మిcక ॥వద్దు॥

4. బెందు పడకు - నిందు విడకు దండి గల తండ్రి యొడ - యుందు యేసుందు నీ - యండ నుండcగ నీ - గుండె దిగు లేల యిcక ॥వద్దు॥

5. పట్టు విడకు - దిటము సెడకు = నెట్టుకొని ముట్టడిగc - జుట్టుకొను కష్టముల - బిట్టు విడcగొట్టు ప్రభు -తట్టు కనిపెట్టు మిcక ॥వద్దు॥

[1]చురుకుగా. [2]ఎల్లప్పుడు. [3]వ్యాపించు. [4]అడ్డులేకుండ. [5]చక్కగా.



6. మంచి గుణము - లెంచికొనుము = వంచనల మించి గ - ర్వించి నీ దుర్భావముc - ద్రుంచు ప్రభు నొద్ద గురి - యుంచి ప్రార్థించు మిcక ॥వద్దు॥

-పురుషోత్తము చౌదరి

## 474 యేసుకొరకే జీవింతును

రా-ముఖారి తా-ఆది

యేసుని కొరకై యిల జీవించెద - భాసురముగ నే ననుదినము = దోసములన్నియు బాపెను మోక్ష - ని వాసమున ప్రభు జేర్చునుగా ॥యేసుని॥

1. నాశనకరమగు గుంటలోనుండియు - మోసకరంబగు యూబినుండి = నాశచే నిలపై కెత్తెను నన్ను పి - శాచి పథంబున దొలగించెన్ ॥యేసుని॥

2. పలువిధముల పాపంబును జేసితి - వలదని ద్రోసితి వాక్యమును - కలుషము బాపెను కరుణను బిలిచెను - సిలువలో నన్నాకర్షించెను ॥యేసుని॥

3. అలయక సొలయక సాగిపోదును - వెలయగ నా ప్రభు మార్గములన్ = కలిగెను నెమ్మది కలువరిగిరిలో - విలువగు రక్తము చిందించిన ప్రభు ॥యేసుని॥

4. శోధన బాధలు శ్రమలిల కల్గిన - ఆదుకొనును నా ప్రభువనిశం = వ్యాధులు లేములు మరణము వచ్చిన - నాధుడే నా నిరీక్షణగున్ ॥యేసుని॥

5. బుద్ధి విజ్ఞాన సర్వసంపదలు -గుప్తమై యున్నవి - ప్రభునందు = అద్భుతముగ ప్రభు - వన్నియునొసగి -దిద్దును నా బ్రతుకంతటిని ॥యేసుని॥

6. అర్పించెను దన ప్రాణమునాకై - రక్షించెను నా ప్రియ ప్రభువు= అర్పింతును నా యావజ్జీవము - రక్షకు డేసుని సేవింప ॥యేసుని॥

7. ప్రభునందానందింతును నిరతము - ప్రార్థన విజ్ఞాపనములతో = విభుడే దీర్చునుయిలనా చింతలు - అభయముతో స్తుతియింతు ప్రభున్ ॥యేసుని॥

8. యౌవన జనమా - యిదియే సమయము యేసుని చాటను రారండి= పావన నామము - పరిశుద్ధ నామము - జీవపు మార్గము - ప్రచురింపన్ ॥యేసుని॥

-రావి జాన్ సుందరావు